ఓం శ్రీసాయిరాం

భక్తులందరుజేరి భగవంతుడాయంచు
చెవులకింపుగ నుతిచేయు దినము
బీదల వెతలన్ని ప్రీతితో తొలగించి
అన్నదమ్ముల మాడ్కినున్న దినము
దైవచింతనజేయు దాసబృందములకు
ప్రీతి మృష్ఠాన్నము పెట్టు దినము
మహనీయులెవరైన మనకడకేతెంచి
చెలిమి బాబా కథల్ చెప్పు దినము
భావమున భక్తిగూర్చు సౌభాగ్య దినము
దినముగాని తక్కినవన్ని దినములగునె
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

ప్రేమస్వరూపులారా! మా ఆలిండియా ప్రెసిడెంటు శ్రీనివాసన్ చెప్పాడు, వినయ్ చాలా తెలివిగలవాడని, చదువుకున్నవాడని, చక్కని యేర్పాట్లు చేస్తున్నాడని చెప్పాడు. అతను చెప్పినను చెప్పకపోయనను అటువంటి యువకులు ఈనాడు చాలా అరుదుగా ఉన్నారు. ప్రపంచమంతయు కూడను ఈనాడు ఉన్నటువంటి అశాంతికి మూలకారణం యువకులే.

చదువులన్ని చదివి చాల వివేకియై
మగిడి తన్నెరుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏరీతినున్నను
హీనుడవగుణంబు మానలేడు.

ఎమ్మేలు, బియ్యేలు యేర్పడ చదివియు పేరుగాంచిన పెద్దవారలుకూడా చదువులలోని మర్మమెల్ల చదువక 'గొప్ప చదువులు చదివితిమి. గొప్ప డిగ్రీలు పొందినాము' అని గర్వించుచున్నారు. ఈ గర్వమువల్ల తమ స్వమతముయొక్క సంప్రదాయమును మరచిపోతున్నారు.

ఆంగ్ల భాషా మోహమావరించిన నాడె
స్వమత విజ్ఞానంబు సన్నగిల్లె
స్వమత విజ్ఞానంబు సన్నగిల్లిన నాడె
సంస్కార భావంబు సమసిపోయె
సంస్కార భావంబు సమసిపోయన నాడె
ధర్మంబు క్షీణించె ధరణియందు
ధర్మము క్షీణమై ధరణి తొలగిన నాడె
భారతీయోన్నతి భగ్నమయ్యె
కాన యిపుడైన మీరలు కన్నుదెరచి
తెలివితోగాంచుడో భారతీయులార
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

ఎక్కడ చూచిననూ అల్లకల్లోలములే! భౌతిక, లౌకిక, ఆధ్యాత్మిక రంగములందుకూడను నైతిక విలువలు సన్నగిల్లిపోయినవి. మానవత్వము మర్యాద కోల్పోయింది. ఈనాడు కూటిపేద మొదలు కోటీశ్వరుని వరకు అందరూ భిక్షగాళ్ల మాదిరి తయారయ్యారు. కూటిపేద భిక్షమెత్తుతున్నాడు. కోటీశ్వరుడూ భిక్షమెత్తుతున్నాడు. ఇందులో ఎవరు

పెద్ద? ఎవరు చిన్న? నిజంగా చూస్తే, కూడు లేక అల్లాడుతున్న కూటిపేదయే పెద్ద. కోటీశ్వరులు తమ వద్ద కోట్లాది రూపాయలున్నప్పటికీ జేబులోంచి నయాపైసా తీసి యివ్వరు. పవిత్రమైన, ప్రశస్తమైన, పరోపకార సంబంధమైన కార్యములకు తాము యేమాత్రమూ సహాయపడరు. కాని, తమ పేరు ప్రతిష్ఠలకొరకు పేపర్లలో తమ ఫొటోలు పెద్దగా వేయించుకుంటారు. వారు ఆచరించే కర్మలు చూద్దామా, వాటికి నయాపైసా విలువ ఉండదు. ఇటువంటి పరిస్థితిని చక్కదిద్దటానికి యువకులు ఈనాడు ఉత్సాహంగా ముందడగు వేయాలి.

దేశమును బాగుపరచాలంటే యువతీయువకులే అందుకు తగిన సమర్థులు. వారియందున్నటువంటి శారీకశక్తి, ఇంద్రియశక్తి, బుద్ధిశక్తి మరి యెవరియందూ లేదు. వారు తలుచుకుంటే యేమైనా సాధించగలరు. తమయందున్న ఇంద్రియశక్తి, మనోశక్తి, దేహశక్తి, బుద్ధిశక్తి, ఆత్మశక్తి సర్వమునూ సమాజమునకై ఉపయోగపెట్టాలి. తమయొక్క ఇంద్రియశక్తిని కాపాడుకొని, సమాజ సంక్షేమమునకై పాటుపడాలి. దేశమును సంరక్షించాలి. కాని, ఈనాటి యువకులు చిన్నచిన్న విషయాలకు లొంగిపోయి బలహీనులైపోతున్నారు. పదహారు సంవత్సరాల పిల్లవానిని చూస్తే వాడు ఎంతో బక్కపడిపోయి బలహీనంగా ఉంటాడు. కారణమేమిటి? తినటానికి తిండి లేక కాదు. తన ఇంద్రియాలను దుర్వినియోగ పరచుకొని తనను తానే బలహీనపరచుకుంటున్నాడు. ఈవిధంగా ఇంద్రియశక్తిని బలహీనపర్చుకోటం చాలా పెద్ద తప్పు. ఇనిద్రియాలు బలహీనమైనప్పుడు మానవుడు పూర్తిగా బలహీనుడౌతాడు. ఇంద్రియశక్తి ప్రాణసమానమైనది. దానిని నేటి యువకులు దుర్వినియోగం చేస్తున్నారు. దీనకి తగినట్లుగా తల్లిదండ్రులకు కూడను పిల్లల చేతికి అమితంగా ధనమిచ్చి వాళ్లు పెడమార్గము పట్టడానికి పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. ఈవిధంగా తల్లిదండ్రులు చేస్తున్నదికూడా పెద్ద పాపమే. తల్లిదండ్రుల మూలంగానే పిల్లలు చెడిపోతున్నారు. పిల్లలకు స్వేచ్ఛ ఎంతవరకు యివ్వాలో అంతవరకే యివ్వాలి. మితిమీరిన స్వేచ్ఛ, మితిమీరిన డబ్బు మతిహాని కలిగిస్తాయి. Too much money makes many wrongs. ధనమును సద్వినియోగ పరచుకోవాలి. Don't waste money, misuse of money is evil. Don't waste food, food is God. Don't waste time, time waste is life waste. ఈనాటి యువకులు ధనమును, ఆహారమును, కాలమును వ్యర్థం గావిస్తున్నారు. అందువల్లనే పూర్తిగా పాడైపోతున్నారు.

ఈనాటి యువకులయొక్క దృష్టి ఎలా ఉంటున్నది? ఒక్క క్షణమైనా స్థిరంగా నిలవదు. కాకివలె ఇటూ అటూ, అటూ ఇటూ చూస్తూ ఉంటారు. ఏది చూస్తే అది కావాలని ఆశ పడతారు. అది ఎలాంటి కోరిక? చెడ్డ కోరిక. యువకులు మొట్టమొదట తమ దృష్టిని అదుపులో పెట్టుకోవాలి. నేత్రమే మనకు పెద్ద శాస్త్రము. దృష్టి ఎట్టిదో సృష్టి అట్టిది. కనుక, ఎవ్వరినీ చెడ్డ దృష్టితో చూడకూడదు. అన్నింటినీ ఆశించకూడదు. నేను ఉన్నదున్నట్లుగా చెబుతున్నాను. మీరేమీ అనుకోకండి. సైకిలు మీద కాలేజీకి పోయే పిల్లలు ఎక్కడైనా రోడ్డుమీద స్త్రీలు కనిపిస్తే, సైకిలునుకూడా వదలిపెట్టి వాళ్లనే చూస్తుంటారు. దీనివల్లనే ఈనాడు మోటారుసైకిళ్ల యాక్సిడెంట్లుకూడా పెరిగిపోయాయి. పోయేది మోటారుసైకిలు పైన, చూసేది బజారులో వెళ్ళే స్త్రీలని! గర్ల్స్‌కాలేజీ ముందుగా పోతుంటే వీళ్ళ దృష్టి అంతా ఆ కాలేజీ వైపే ఉంటుంది. ఇందుకోసమా భగవంతుడు కన్నులనిచ్చినది!

కన్నులనిచ్చినదెందుకొ తెలుసా?
అన్నీ చూసేటందులకా? కాదు, కాదు, కాదు.
కైలాసవాసుని కన్నులారా గాంచేటందుకురా!

ఇంక మాటలు చూస్తామా అంటే, వీరి నోటినుండి మంచి మాటలే రావటం లేదు. అన్నీ చెడ్డ పలుకులే! ముగ్గురు పిల్లలు ఒకచోట కలుసుకున్నారంటే, వాళ్లు మాట్లాడేదంతా పిచ్చిపిచ్చి మాటలే!మన నాలుక ఎంత పవిత్రమైనది! అటువంటి నాలుకతో చెడ్డ పలుకులు పలుకకూడదు. మధురమైన పలుకులు పలుకటానికే భగవంతుడు మనకు నాలుకనిచ్చినది. నాలుకను పవిత్రంగా ఉపయోగించుకోవాలి. ఈనాటి యువకులు 'వీరు అందంగా ఉన్నారా, వారు అందంగా ఉన్నారా' అంటూ అందాన్ని గురించి మాట్లాడతారే తప్ప ఆత్మానందాన్ని గురించి మాట్లాడరు. ఆనందములో ఉన్న అందము మరి ఎందులోనూ లేదు. ఆనందమే అందము. ఆనందమును అనుభవించాలంటే దృష్టిని అరికట్టుకోవాలి. ఎప్పుడైనా మనస్సులో చెడ్డ భావం కలిగితే, 'ఛ, ఇది నాకు మంచిది కాదు. నేను మానవత్వాన్ని ధరించాను. భగవంతుడు నాకు కన్నులనిచ్చినది సృష్టిలోని చిత్రవిచిత్రాలను చూడటానికేగాని, శారీకమైన అందచందాలను చూడటానికి కాదు' అని ఎవరికివారు బుద్ధిచెప్పుకోవాలి. కన్నులతో సుందరమైన భగవత్ స్వరూపాన్ని దర్శించాలి. కొందరు యువకులు ఎలా ఉన్నారంటే, దారిలో ఉన్న దేవాలయం వాళ్ళ కంటికి కనబడదు, దేవాలయనికి వచ్చిపోయే ఆడవారే కనబడుతుంటారు. ఇదేనా మానవునికి ఉండవలసిన దృష్టి! ఈవిధమైన వ్యర్థ దృష్టి, వ్యర్థ

మాటలు, వ్యర్థ శ్రవణం వల్ల మానవుడు రాక్షసుడుగా మారిపోతున్నాడు. యువకులు చాలా జాగ్రత్తగా ఉండాలి. తమ ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. అప్పుడు అన్నింటినీ చూడవచ్చును. ఏ దోషమూ ఉండదు.

ప్రేమస్వరూపులారా! పిల్లపై ఉన్నటువంటి ప్రేమచేతనే నేనింతగా చెబుతున్నాను. ఇలాంటివన్నీ మీలో మీరు దాచిపెట్టుకోవచ్చును. కాని, నేను దాచిపెట్టుటకు వీలుకాదు. సత్యాన్ని గుర్తించి వర్తించినప్పుడే మానవుడు మానవునిగా జీవించగలడు. పెద్దలు, తల్లిదండ్రులుకూడా ఈవిషయంలో తగిన జాగ్రత్త వహించాలి. 'కొడుకు, కొడుకు' అంటూ తల్లిదండ్రులు ప్రాకులాడుతుంటారు. నీ ప్రేమను నీ కొడుకుపై చూపు, కీని వాని చెడు అలవాట్లపై చూపకూడదు. పిల్లవాడు చెడిపోతే ఎవరికి చెడ్డపేరు? తల్లిదండ్రులకే!

వేదము చెబుతున్నది, 'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ'. జన్మకు మూలకారణం తల్లిదండ్రులు. కాబట్టి, ఎలాంటి పరిస్థితులందైననూ పిల్లలు తమ తల్లిదండ్రులను హృదయపూర్వకంగా ప్రేమించాలి. 'తల్లియే నా మొట్టమొదటి దేవత. తండ్రియే నా దేవుడు. తల్లిదండ్రులే నన్ను కాపాడుతున్నారు' అనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. ప్రత్యక్ష దైవాలైన తల్లిదండ్రులను మరచి మనము ఎన్ని ఘనకార్యాలు సాధిస్తే ఏమి ప్రయోజనం! మన సేవాదళం వారు, యువకులు ఈవిధమైన ప్రచారప్రబోధలు సల్పి సమాజములోని చెడును అరికట్టాలి. ఎన్ని అవరోధాలు ఎదురైనా వాటిని అధిగమించి, మన ప్రాణమైనా పణంగా పెట్టి సమాజాన్ని సరియైన దారిలో పెట్టాలి.

విద్యార్థులారా! యువకులారా! ధనమును వ్యర్థం చేయకూడదు. అట్లే, మాటలనుకూడా వ్యర్థం చేయకూడదు. మౌనమును వహించండి. 'మౌనం కలహం నాస్తి'. మన శ్రీనివాసన్ (అఖిల భారతసాయిసంస్థల అధ్యక్షులు) చెప్పాడు, 'యువకులు టెక్నాలజీలో తగిన శిక్షణ పొందాల'ని. కాని, ఈనాటి మానవుడు నేర్చుకుంటున్నది 'టెక్నాలజీ' కాదు, 'ట్రిక్'నాలజీ! ఈ 'ట్రిక్కుల' వల్లనే మానవుడు చాలా చెడిపోతున్నాడు. మీరందరూ అతి జాగ్రత్తగా మెలగాలి. మన పేరును మనము నిలబెట్టుకోవాలి. మన కుటుంబ గౌరవమును కైపాడుకోవాలి. వ్యష్టి, సమష్టి మధ్యగల సంబంధాన్ని గుర్తించి వర్తించాలి.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని చదువు నిమిత్తము చండ, అమార్కుల వద్దకు పంపించాడు. గురువులు అతనికి అనేక విద్యలు బోధించారు. కొంతకాలము తరువాత హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని పిలిపించి, ఆప్యాయంగా తొడపైన కూర్చోబెట్టుకొని, 'నాయనా! నీ చదువు ఎంత వరకు వచ్చింది? ఏమి నేర్చినావు?' అని ప్రశ్నించాడు. అప్పుడు ప్రహ్లాదుడు చెప్పాడు,

చదవించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు
చదివినవి కలవు పెక్కులు
చదువులలోని మర్మమెల్ల చదివితి తండ్రీ!

'ఏదీ, నీవు చదివినటువంటి విషయాల్లో ఏదైనా ఒకటి ' అన్నాడు తండ్రి. 'ప్రతి ఒక్కరికి సత్శీలం ప్రధానం. సత్శీలం లేనివాడు పశువుతో సమానం' అని ప్రహ్లాదుడు చెప్పేసరికి తండ్రికి కోపం వచ్చింది. సభలో ఉన్నవారందరికీ చాలా ఆశ్చర్యం కలిగింది. అప్పుడు హిరణ్యకశిపుడు ఒకామెను పిలిపించాడు. 'ఈమె ఎవరు?' అని ప్రశ్నించాడు. 'నా తల్లి' అన్నాడు ప్రహ్లాదుడు. నిజానికి ఆమె అతని తల్లి కాదు, సర్వెంటు. హిరణ్యకశిపుడు ఆడవారినందరినీ అక్కడికి పిలిచాడు. 'వీరందరూ ఎవరు?' అని అడిగాడు. 'చిన్న వారందరూ నా చెల్లెళ్లు. పెద్దవారందరూ నా అక్కలు' అని జవాబిచ్చాడు ప్రహ్లాదుడు. తండ్రికి బుఱ్ఱ తిరిగిపోయింది. కొడుకుపైనున్న కోపంచేత గురువులనుకూడా పిలిపించి మందలించాడు. 'ఇదేనా మీరు పిల్లలకు నేర్పవలసినది! వాళ్లు పెరిగి పెద్దవారైన తరువాత సహజంగా ఇదే మార్గంలో ప్రవేశిస్తారు. కాబట్టి, ఇలాంటివి పిల్లలకు మీరు యేమాత్రమూ నేర్పకూడదు' అని హెచ్చరించాడు. ప్రహ్లాదునిచేత హరినామస్మరణ మాన్పించమని వారిని శసించాడు. చండామార్కులు చాలా భయపడిపోయారు. గురుకులానికి తిరిగి తరువాత ఆ పిల్లవానిని తిట్టి, కొట్టి అనేకవిధములుగా దండించి అతనిచేత హరినామస్మరణ మాన్పించటానికి ప్రయత్నం చేశారు. అప్పుడు ప్రహ్లాదుడు, 'గురువర్యా! హరిని స్మరించవద్దని బోధించే గురువొక గురువా! తండ్రి హరి చేరుమనియెడి తండ్రి తండ్రి. అట్లనే, గురువులుకూడా హరిచింతన చేయమని శిష్యులకు బోధించాలి. ఇట్టి పవిత్రమైన విషయాలు బోధించకుండా ప్రాపంచికమైన విషయవాసనలలో నన్ను ముంచటానికి మీరు ప్రయత్నిస్తున్నారు. ఇది నాకక్కర్లేదు' అన్నాడు. 'హరిబోల్ హరిబోల్ హరిహరి బోల్...' అంటూ ప్రహ్లాదుడు హరినామ సంకీర్తన గావిస్తూ

అక్కడనుండి బయలుదేరాడు. 'హరి కంటె మించిన వారు లేరు' అని తోటి విద్యార్థులకు అతను బోధిస్తూ వచ్చాడు.

అందరికీ ఈశ్వరుడే ముఖ్యము. సర్వులయందు ఉన్నటువంటిది ఈశ్వరత్వమే. 'ఈశ్వరస్సర్వ భూతానామ్'. దైవత్వాన్ని పూజించుటకు, దైవత్వాన్ని గురించి తలంచుటకు మీరుకూడా ప్రహ్లాదునివలె అందరికీ తగినటువంటి ఉత్సాహప్రోత్సాహల నందించాలని నా ఆశ. ఈవిధమైన ప్రచారప్రబోధలు సల్పినప్పుడు ఒక్క క్షణంలో సమాజములో దివ్యమైన పరివర్తన తీసుకొనిరావచ్చును. దీనిని ముందుగా మన ఇంటిలో ప్రారంభించాలి. తల్లిదండ్రులు దేహాన్ని మాత్రమే పోషించగలరు. కాని, ఆత్మతత్వాన్ని ఎవరు పోషించగలరు? భగవంతుడొక్కడే మనకు దిక్కు. కనుక, దైవాన్ని గుర్తించే దృష్టిని పిల్లలకు కలిగించి తల్లిదండ్రులు సరియైన ఆదర్శమును అందించాలి. 'పాంచభౌతికము దుర్బలమైన కాయంబు, ఎప్పుడో విడిచేది ఎరుకలేదు'. ఈ దేహమును ఎన్నివిధాలుగా పోషించిననూ ఇది యేనాడు ఏ క్షణంలో ఏవిధంగా వెళ్ళిపోతుందో! పశుపక్షిమృగాదులవలె ఆహార, నిద్ర, భయ, మైథునాదులతో కాలము గడపటమే మానవ లక్షణమా! కాదు, కాదు, కాదు. ప్రతి క్షణము భగవచ్చింతనతో సార్థకం చేసుకోవాలి. అదే తల్లిదండ్రులు పిల్లలకు నేర్పవలసినది. అదే మన ఇంట, వెంట, జంట, కంట ఉండి మనల్ని కాపాడేటటువంటిది. ఇట్టి పవిత్రమైన మార్గమును పిల్లలకు బోధించటం తల్లిదండ్రుల ప్రధానమైన కర్తవ్యము. గురువులుకూడను ఈవిధమైన మార్గము ననుసరించాలి. గురువులు ఈనాడు 'టెక్స్టబుక్స్' లో ఉన్న విషయాలను మాత్రమే పిల్లలకు బోధిస్తున్నారు. కాబట్టి, మన యువకులందరూ ఒక్కొక్క స్కూలుకు వెళ్ళి పిల్లలకు సరియైన బోధలు చేయాలి. ఎక్కడైనా వెళ్ళే సమయంలో ఎవరైనా పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతూ కనిపిస్తే వాళ్ళకు రెండు చెంపదెబ్బలు వేయండి. వాళ్ళు తరిగి కొట్టినా ఫరవాలేదు. కాని, మొట్టమొదట అటువంటి వాళ్లను శిక్షించాలి. 'నీవు మానవునిగా పుట్టి ఈవిధంగా పరస్త్రీలనుద్దేశించి అపవిత్రమైన మాటలు మాట్లాడటం మంచిది కాదు' అని బుద్ధి చెప్పాలి. నీవు పరస్త్రీలను హింసించే నీవంటివారిని పరులు హింసించకుండా ఉంటారా! నీ భార్యను, నీ పిల్లలను జగత్తు వదలిపెడుతుందా! నీవు మొట్టమొదట పరులను ప్రేమించాలి. పరులను గౌరవించాలి. అప్పుడే వారినుండి నీవుకూడా ప్రేమ, గౌరవాలను అందుకోగలవు.

ఈనాడు ముఖ్యంగా యువతీ యువకులు మానవత్వాన్ని పెంచుకోవాలి. సత్యసాయి సంస్థల్లో మేము, 'యూత్ వింగ్'ను స్థాపించినది ఈ మంగళ కార్యముకోసమే. వాళ్ళు మార్గదర్శకులుగా ఉండాలి. బజార్లో యిష్టమొచ్చినట్లు తిరిగేవారు గాడిదలే తప్ప యువకులు కారు. అలాంటి జీవితము కాదు మనము గడపవలసినది. బజార్లో గాడిదలు యిష్టము వచ్చినట్లు ఓండ్రపెడుతూ పోతుంటాయి. నీవు గాడిద కాదు. నీలో 'గాడ్' ఉన్నాడు. ఈ సత్యాన్ని గుర్తించు. పవిత్రమైన మానవత్వాన్ని నిలుపుకో. నీ గౌరవాన్ని నీవు కాపాడుకో. ఇదే యువతయొక్క ప్రధానమైన కర్తవ్యం.

కొంతమంది పిల్లలు టెక్స్ట్ బుక్స్‌లోపల పిచ్చిపిచ్చి నవలలు దాచుకొని చాలా గుట్టుగా చదువుతుంటారు. చూసేవారికి మాత్రం వాళ్లు టెక్స్ట్ బుక్స్ చదువుతున్నట్లుగా అనిపిస్తుంది. ఈవిధంగా టీచర్సునుకూడా మోసం చేస్తున్నారు. మీ మనసులో ఏవైనా చెడ్డ తలంపులు కలిగితే, 'నేను మానవుడను, పశువును కాను' అని మిమ్మల్ని మీరు హెచ్చరించుకోవాలి. 'మానవుడు' అనే పేరుకు తగినట్లుగా మీరు నడచుకోవాలి. అప్పుడే 'నేను మానవుడను' అని చెప్పుకోటానికి మీకు అర్హత ఉంటుంది. మానవతా గుణములను పోషించుకున్నప్పుడే మీరు విన్న విషయాలకు, చదివిన విషయాలకు విలువ యేర్పడుతుంది.

ప్రేమస్వరూపులారా! నాకు మాపైన ఎంతో ప్రేమ ఉన్నది. నా ప్రేమను ఇట్టిది, అట్టిది అని ఎవ్వరూ వర్ణించ లేరు. నా ప్రేమలో ఎట్టి వ్యత్యాసమూ లేదు. నా ప్రేమకు సాటి నా ప్రేమయే. ఎవరేమనుకున్నా ఫరవాలేదు. నాకేమీ భయం లేదు. చాలామంది నన్నుకూడను దూషిస్తుంటారు. పేపర్లలో 'న్యూసెన్స్' అంతా వేస్తుంటారు. బయటి దేశములనుండి వచ్చే 'న్యూసెన్స్'ను కూడా వేస్తుంటారు. బయటి దేశాల వారిని అనుసరించేవాడు నిజమైన జర్నలిస్టా? కాదు, కాదు. నిజమైన జర్నలిస్టు ఆవిధంగా అనుసరించడు. తాను స్వయంగా చూసి అనుభవించిన విషయాలకే ప్రాధాన్యత యిస్తాడుగాని, ఏ లండనులోనో, ఏ అమెరికాలోనో పరులు వేసిన 'న్యూసెన్స్'ను పట్టించుకోడు. అటువంటివన్నీ విని ప్రచారం చేసేవాళ్లు కుక్కలవంటివారు. ఎక్కడో ఒక కుక్క మొరిగితుంటే, అది విని ప్రక్క వీధిలో యింకో కుక్క కూడా మొరుగుతుంటుంది. కాబట్టి, పరులను అనుసరించేవాడు కేవలం కుక్కవంటివాడేగాని, మానవుడు కాదు. ఎవ్వరేమనుకున్నప్పటికీ మన సత్యము మనదే! సత్యము నీయందే ఉన్నది. నీవు సత్యముతో కూడినవాడవు. కాబట్టి, అసత్యాన్ని నీవు లెక్కచేయకూడదు. ఎవరైనా ఏమైనా అనిటున్నారా... అననీ. ఏవో కుక్కలు మొరుగుతుంటాయి. వాటితో మనకు పని లేదు. దుర్బుద్ధితో విమర్శించే వాళ్లని మనం కుక్కలవలె చూడాలిగాని, మనుష్యులవలె చూడకూడదు.

స్వామి దగ్గరికి ఎంతోమంది వస్తుంటారు. మేము ఎవరికైనా ఇన్విటేషన్లు పంపుతున్నామా? నో, నో, ఎవ్వరికీ ఇన్విటేషన్లు పంపటంలేదు. 'స్వామి దగ్గరికి ఇంతమంది వస్తున్నారే! స్వామికి గొప్ప పేరు వసుంన్నాదే!' అన్న అసూయచేత కొందరు స్వామియొక్క పేరును చెడగొట్టాలని చూస్తుంటారు. కావాలంటే వాళ్లనుకూడా ఇంతమందిని తమ దగ్గరకు చెర్చుకోమనండి, చూద్దాం. అది అసాధ్యం! అటువంటివాళ్ల దగ్గరకు పదిమందికూడా చేరరు. కారణమేమిటి? వారిలో ఆ మంచితనం లేదు. మంచితనమే దైవత్వం. ఆ మంచితనమే అందరినీ తన వద్దకు ఆకర్షిస్తుంది.

ప్రేమస్వరూపులారా! మీ ప్రేమను మీరు పాడుచేసుకోకండి, మరుగుచేసుకోకండి. మీ ప్రేమను మీరు పెంచుకుంటూరండి. అప్పుడే మీ మనస్సు పవిత్రమౌతుంది. మీ మానవత్వం సార్థకమౌతుంది. అప్పుడే మీరు మానవులు అనిపించుకుంటారు. లేకపోతే, దానవులుగా మారిపోతారు. పరుల మాటలు విని మోసపోకండి. మీరిక్కడ విన్నటువంటి విషయాలను మనస్సులో భద్రపరచుకోండి. దైవత్వాన్ని మీ హృదయంలో నిల్పుకోండి.

ప్రేమస్వరూపులారా! నేనింత కఠినంగా చెబుతున్నానని మీరు బాధపడుతున్నారేమో. దీనికి మీరు ఆనందించాలేగాని, యేమాత్రమూ నొచ్చుకోకూడదు. దైవత్వం ఎవ్వరికీ కానరాదు. అది కనిపించి 'అడ్వర్‌టైజ్' చేసుకునేది కాదు. ఏ పేపర్లోనైనా మీరు చూడండి. ఒక్కొక్క పేపర్లో ఒక్కొక్క అడ్వర్‌టైజ్‌మెంటు కనిపిస్తుంది. తప్పుడు విషయాలనే వాళ్లు 'అడ్వర్‌టైజ్' చేస్తుంటారు. వాళ్ల బుద్ధి ఎంతగా దిగజారిపోయిందో చెప్పటానికి వీలుకాదు. ఇది కేవలం మూర్ఖత్వం. నిజంగా వాళ్లు మనుష్యులైతే ఇలాంటి తప్పుడు విషయాలను 'అడ్వర్‌టైజ్' చేయరు. వాళ్లకంత ఆసక్తిగా ఉంటే తాము స్వయంగా వచ్చి చూసి ఆనందాన్ని అనుభవించాలి. ఏవో తాము విన్నటువంటివన్నీ విచక్షణా రహితంగా పేపర్లో వేయటం చాలా పొరపాటు. చదివేవారుకూడా ఈ సత్యాన్ని గుర్తించి వర్తించాలి. సత్యాన్ని అనుసరించి మీరు మెలగుతూ ఉండినప్పుడు ఈ జగత్తులో మిమ్మల్ని జయించగలవాడు, మిమ్మల్ని దండించగలవాడు ఒక్కడూ ఉండడు. నీవు సత్యాన్ని పాటించు. నీ సత్యమే నీకు సాక్షి.

మనస్సుకు మనస్సు సాక్షి
దేహానికి గుణము సాక్షి
మూఢునకు మూర్ఖం సాక్షి
సర్వమునకు స్వామి సాక్షి.

మనం 'ఫూల్' కాకూడదు. భగవంతునికి అర్పితమయ్యే పూలు కావాలి మనం. హృదయ పుష్పాన్ని భగవంతునికి అర్పించవలసిన మనం అందుకు విరుద్ధంగా నడచుకుంటూ 'ఫూల్స్' మాదిరి తయారు కావటం మంచిది కాదు.

విద్యార్థులారా! మున్ముందు చెప్పవలసినవి యింకా ఎన్నియో ఉన్నాయి. మిమ్మల్ని సరిచేసే నిమిత్తమై నేనివన్నీ ప్రస్తావిస్తున్నాను. ప్రేమ, ప్రేమ, ప్రేమ! ప్రేమ ఒక్కటి నిలుపుకోండి, చాలు. ఆ ప్రేమను అన్నింటిపైన నిల్పుకోకూడదు. భగవంతునిపై మాత్రమే ప్రసరింపచేయాలి. అప్పుడే మీరు బాగుపడతారు. లేకపోతే, ఎన్ని చదువులు చదవి యేమి ప్రయోజనం? ఈనాటి 'ఎడ్యుకేషన్' అంతయు 'ఏజిటేషన్'కు దారితీస్తున్నది. ఈ పరిస్థితిని చక్కచేయాలంటే, 'ఎడ్యుకేషన్' మాత్రమే కాకుండా 'ఎడ్యుకేర్' కూడా ఉండాలి. 'ఎడ్యుకేషన్' అనేది మనకు గ్రంథములనుండి లభిస్తుంది. 'ఎడ్యుకేర్' మన హృదయమునుండి ఆవిర్భవిస్తుంది. కనుక, మనము 'ఎడ్యుకేర్'ను చేపట్టాలి. 'ఎడ్యుకేర్' అనగా సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ మొదలైన మనవతా గుణములను మన హృదయమునుండి ఆవిర్భవింపచేసుకోవాలి. లౌకికమైన 'ఎడ్యుకేషన్' బుక్కునుండి లభ్యమవుతుంది. బుక్కు ముక్కువంటిది. కాని, 'ఎడ్యుకేర్' శ్వాసవంటిది. శ్వాస లేకపోతే ప్రాణమే లేనట్లు. అదేరీతిగా, 'ఎడ్యుకేర్' లేకపోతే మానవత్వం నిలువజాలదు.

దివ్యాత్మస్వరూపులైన విద్యార్థులారా! మీరు అందరూ చాలా మంచి పిల్లలే! బంగారువంటి పిల్లలే! అయితే, మీరు 14 కేరెట్ బంగారం మాదిరి ఉండకూడదు. 24 కేరెట్ బంగారంలా ఉండాలి. మీ విలువను యేమాత్రమూ తగ్గించుకోకూడదు. ఆవిధంగా ఉంటే మీ అందరికీ నేనెంతో సహాయం చేస్తాను. ఆర్థికంగా, పారమార్థికంగా అన్నింటియందు మీకు సహాయం చేస్తాను. మీరు మంచి బిడ్డలుగా తయారుకండి. మంచి పేరు తెట్టుకోండి. (స్వామి హయ్యర్‌సెకండరీ స్కూలులోని ఒక అమెరికన్ విద్యార్థిని, ఒక రష్యన్ విద్యార్థిని వాదికపైకి పిలిచి వారిచేత నమకము, చమకము, శ్రీసూక్తము చెప్పించారు)

ఈ అబ్బాయి అమెరికావాడు. ఆ అబ్బాయి రష్యావాడు. ఇద్దరికి ఎటువంటి ఆకమత్యం కుదిరిందో చూడండి.

ఈ పిల్లలకు నమకము, చమకము మొదలైన వేదమంత్రాలు అనేకం తెలుసు. ఇంకా ఇతర దేశంవారుకూడా వచ్చి వేదమును నేర్చుకుంటున్నారు. కాని, మన భారతీయులే వేదమును మరచిపోతున్నారు. విదేశీయులు సంస్కృతభాషలో ఉన్న వేదమంత్రాలను నేర్చుకొని సుస్పష్టంగా ఉచ్చరించగలుగుతున్నారు. కాని, మన భారతీయులు నేర్చుకుంటున్నదేమిటి? 'డింగ్ డాంగ్ బెల్ పుస్సీ ఈజ్ ఇన్ ది వెల్'. ఇలాంటివా మనం నేర్చుకోవలసినవి! కాదు, కాదు. పవిత్రమైన భారతీయ తత్త్వాన్ని గుర్తించాలి. భరతదేశమందు నీతియే తల్లి. నిజాయతీయే తండ్రి. శాంతమే చెల్లెలు. ధైర్యమే సోదరుడు. ఇట్టి శాశ్వతమైన, పవిత్రమైన సంబంధాలను విస్మరించి లౌకికమైన, క్షణభంగురమైన సంబంధాలను మీరు పెంచుకుంటున్నారు. ఈ పిచ్చిపిచ్చి సంబంధాలను పెట్టుకోకూడదు. Tell me your company, I shall tell you what you are. నీవు ఎలాంటివారితో స్నేహం చేస్తావో అలాంటివాడే నీవవుతావు. కాబట్టి, మీరు సత్సంగములో ప్రవేశించండి.

ఇంకా కావలసినంత టైమ్ ఉంది కనుకముున్ముందు మీకు తెలుపుతాను. ఎవరేమన్నా నాకేమీ భయం లేదు. నా సత్యమునే నేను ఆధారం చేసుకున్నాను. ఎవరేమనుకున్నా ఫరవాలేదు. నేను ఎవరికీ లొంగను. సత్యముపైన నమ్మకం ఉన్నటువంటివాడు ఎవ్వరికీ భయపడడు. కనుక, ముున్ముందు అన్నీ బయటపెడతాను.

(అతిరుద్రమహాయజ్ఞ సందర్భంగా 13 ఆగష్టు 2006 సాయంత్రం స్వామివారిచ్చిన దివ్యోపన్యాసం)